మిడిల్‌క్లాస్ ఫ్యామిలీతో స్టార్



సుభాష్‌నగర్: సినీ హీరో విజయ్ దేవరకొండ, ప్రొడ్యూసర్ దిల్ రాజులు ఓ సామాన్యుడి ఇంటి తలుపులు తట్టారు. ఒక్కసారిగా వారిని చూసిన ఆ కుటుంబ సభ్యుల ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. సూరారం కాలనీకి చెందిన ప్రశాంత్ అమెజాన్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆయనతో పాటు అతని చెల్లి స్వరూప ఇంటి వద్ద కిరణా దుకాణం నడుపుతూ అమెజాన్‌లో వర్క్ ఫ్రమ్ హోం జాబ్ చేస్తోంది. ఇటీవల ప్రశాంత్ 'మీమర్స్ మీట్'లో దిల్ రాజుతో పాల్గొన్నారు. తన చెల్లి కుటుంబానికి చేస్తున్న కృషిని ఆయనకు వివరించారు. దీంతో రెండు రోజుల క్రితం దిల్ రాజు, విజయ్ దేవరకొండలు సూరారం కాలనీలోని వారి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యులతో యోగక్షేమాలు తెలుసుకున్నారు. వారు సంభాషించుకుంటున్న చిత్రాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

యథేచ్ఛగా టీఎస్‌హెచ్‌బీ స్థలం కబ్జా

- భారీగా ఆదాయం కోల్పోతున్న జీహెచ్ఎంసీ
- చర్యలు తీసుకోవడంలో చోద్యం చూస్తున్న అధికారులు
- అక్రమణదారులకు స్థలం లీజుకు ఇవ్వాలని ప్రజాప్రతినిధి సిఫార్సు



ఐడీపీఎల్ చౌరస్తాలోని కబ్జా చెరలో చిక్కుకున్న 2.25 ఎకరాల టీఎస్‌హెచ్‌బీ స్థలం వ్యూ

రంగారెడ్డినగర్: కోట్లాది రూపాయాల విలువ చేసే తెలంగాణ హౌసింగ్ బోర్డు స్థలాల పరిరక్షణకు సరైన చర్యలు తీసుకోకపోవడంతో కబ్జాదారులకు వరంగా మారుతున్నాయి.. కొందరు వ్యక్తులు లారీ అసోసియేషన్ పేరుతో భవన నిర్మాణ సామాగ్రిని డంప్‌చేస్తూ లక్షల్లో ఆదాయాన్ని జేబుల్లో వేసుకుంటున్నారు.

◆ రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఐడీపీఎల్ చౌరస్తాకు అనుకుని తెలంగాణ హౌసింగ్ బోర్డుకు సంబంధించిన సర్వే నెంబరు 144 నుండి 149లో 2.25 ఎకరాల స్థలాన్ని కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి వదిలిపెట్టారు. అయితే సదరు స్థలాన్ని కృషి ఇంజనీర్స్ మరికొందరు తమది పేర్కొనడంతో ఈ విషయమై సర్వేకు అనుమతించాలని కోరుతూ అప్లికేషన్ నెంబరు 361 ఆఫ్ 2010 ను అప్పటి ఉమ్మడి రాష్ట్రంలోని ఏపీహెచ్‌బీ తరపున హైకోర్టులో ఆర్జి పెట్టారు. దీంతో అప్పటి డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ సర్వేయర్ నేతృత్వంలో 2011 అక్టోబరు 9, 10 తేదీల్లో సర్వే చేపట్టి ఏపీహెచ్‌బీకి చెందిన స్థలంగా తేల్చారు.

◆ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలంగాణ స్టేట్ హౌసింగ్ బోర్డుగా ఆధీనంలోకి సదరు స్థలం వెళ్లింది. అయితే హౌసింగ్ బోర్డు అధికారులు ఆపై స్థలాన్ని పరిరక్షించే విషయంలో సరైన చర్యలు తీసుకోకపోవడంతో కొందరు స్థానిక లారీ అసోసియేషన్ సభ్యుల కన్ను సదరు స్థలంపై పడింది. దీంతో ఎంచక్కా స్థలంలో భవన నిర్మాణానికి ఉపయోగించే ఇసుక, కంకర, ఇటుక వంటివి డంప్ చేస్తూ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

◆ ఇటీవల ఐడీపీఎల్ చౌరస్తాను విస్తరించే క్రమంలో టీఎస్‌హెచ్‌బీ అధికారులు సదరు 2.25 ఎకరాల చుట్టూ ప్రహరీ గోడను నిర్మించారు. అయినా ఇసుక, ఇటుక, కంకర వ్యాపారాలకు మాత్రం అడ్డుకట్ట పడలేదు.. ఇలా సంవత్సరాల తరబడి తిష్టవేసి టీఎస్‌హెచ్‌బీ స్థలంలో వ్యాపారాలు నిర్వహిస్తూ నయా పైసా బోర్డుకు చెల్లించకుండా లక్షలాది రూపాయాలు ఆర్జిస్తున్నారు.

ప్రహరీని తొలగించి వ్యాపారాలు...

◆ ఐడీపీఎల్ స్థలం చుట్టూ ప్రహరీ గోడను ఏర్పాటు చేయగా ఏపీహెచ్‌బీ కాలనీకి ఎంట్రన్స్‌కు ఆనుకుని ఉన్న ప్రాంతంలో గోడను తొలగించి మీరి లారీ ఓనర్స్ అధికారులు వ్యాపారాలు కొనసాగించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయం స్థానిక టీఎస్‌హెచ్‌బీ అధికారులకు దృష్టికి వెళ్లినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ ఇచ్చే నెలావారీ మామూళ్లకు అలవాటు పడి సంబంధిత అధికారులు కబ్జా విషయాన్ని పట్టించుకోవడం లేదన్నది బహిరంగ రహస్యం. దీంతో 2.25 ఎకరాల టీఎస్‌హెచ్‌బీకి చెందిన ఖాళీ స్థలం మరోమారు కబ్జా చెరలో చిక్కుకుంది.

స్థలం లీజుకు ఇవ్వాలని నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధి సిఫార్సు..

◆ ఎలాంటి అనుమతులు లేకుండానే ఇసుక, కంకర లను డంప్ చేసుకుని వ్యాపారాలు చేస్తున్న లారీ ఓనర్స్ అసోసియేషన్‌కు మద్దతుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధి టీఎస్‌హెచ్‌బీ ఉన్నతాధికారులకు ఎనిమిది నెలల క్రితం లేఖ రాసినట్లు తెలుస్తోంది. అందులో సదరు లారీ ఓనర్స్ అసోసియేషన్‌కు టీఎస్‌హెచ్‌బీ స్థలాన్ని లీజుకు ఇవ్వాలని సిఫార్స్ చేసినట్లు సమాచారం. అయితే తెలంగాణ హౌసింగ్ బోర్డు కమిషనర్ ఈ సిఫార్స్‌ను తిరస్కరించినట్లు విశ్వసనీయ సమాచారం.

జీహెచ్ఎంసీ ఆదాయానికి భారీగా గండి..

◆ టీఎస్‌హెచ్‌బీ ఖాళీ స్థలంలో ప్రతినిత్యం పదుల సంఖ్యలో లారీలు, ట్రాక్టర్లలో ఇసుక, కంకర, ఇటుకలను డంప్ చేసి వ్యాపారాలు నిర్వహిస్తున్న లారీ అసోసియేషన్ సభ్యులు జీహెచ్ఎంసీకి మాత్రం పన్నులు కట్టడం లేదు.. దీంతో జీహెచ్ఎంసీ లక్షల్లో ఆదాయం కోల్పోతోంది. ఇంత బహిరంగంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నా ఏ ఒక్క జీహెచ్ఎంసీ అధికారి సదరు వ్యాపారాలకు పన్నులు విధించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కిందిస్థాయి సిబ్బంది చేతివాటంతో ప్రతి ఏడాది జీహెచ్ఎంసీకి ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మేల్కొని భవన నిర్మాణ సామగ్రి విక్రయాలు చేపడుతున్న వారిపై ట్యాక్స్‌లు విధించి జీహెచ్ఎంసీ ఆదాయాన్ని పెంచుకునేలా చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.

నూతన టీఎస్‌హెచ్‌బీ డీఈ బాధ్యతలు చేపట్టిన తరువాతే చర్యలు..

◆ కాగా టీఎస్‌హెచ్‌బీకి సంబంధించి సనత్‌నగర్‌లో స్థానిక కార్యాలయం ఉండగా డిప్యూటీ ఇంజినీర్ అధికారి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొత్త అధికారిని నియమించినా ఇంత వరకు ఆయన బాధ్యతలు చేపట్టలేదు. కొత్త అధికారి బాధ్యత చేపట్టిన తరువాతే నియోజకవర్గ ప్రజాప్రతినిధి లీక్‌కు కౌంటర్ ఇవ్వనున్నట్లు, ఆ పైనే టీఎస్‌హెచ్‌బీ స్థలంలో జరుగుతున్న భవన నిర్మాణ సామగ్రి వ్యాపారాలకు అడ్డుకట్ట పడే అవకాశముందని కిందిస్థాయి అధికారులు పేర్కొంటున్నారు.



ఏపీహెచ్‌బీ కాలనీ ఎంట్రన్స్‌ను ఆనుకుని పక్కనే నిర్మించిన టీఎస్‌హెచ్‌బీ స్థల ప్రహరీని తొలగించిన దృశ్యం





టీఎస్‌హెచ్‌బీ స్థలంలో యథేచ్ఛగా కొనసాగుతున్న భవన నిర్మాణ సామగ్రి దందా

నూతన సంవత్సరంలో ప్రజలందరికీ శుభాలే కలగాలి

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: నూతన సంవత్సరంలో ప్రజలందరికి శుభాలే కలగాలని... సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకువెళ్లి దేశానికే ఆదర్శంగా తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి, మాజీ కౌన్సిలర్ రంగారావుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు షాపూర్‌నగర్‌లోని నివాసంలో శ్రీశైలంగౌడ్‌ను కలిసి నూతన తెలుగు సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నూతన తెలుగు సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీకి అన్ని శుభాలే కలుగుతాయని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక ఎంపీ స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఐఎన్‌టీయూసీ నాయకులుగుంజ శ్రీనివాస్, ఐలయ్యా గౌడ్, దుర్గారావు, శివ, సాయిబాబా, సత్యనారాయణ, చాంద్ పాషా, మోతె శ్రీనివాస్ యాదవ్, ఏర్వ వెంకటరమణ, వల్లపు వేణు, రమేష్, విజయ్ గుప్తా, ఓరుగంటి అఖిల్ సాయి, వీరేందర్ గుప్తా, సిద్దయ్య, జేమ్స్ తదితరులు ఉన్నారు.

సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఆహ్వానం

కుత్బుల్లాపూర్: ఎన్నో యుగాలు గడిచినా సీతారాములు నేటికి ఆదర్శ దంపతులుగా పూజలు అందుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి కౌసల్య కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం షాపూర్‌నగర్‌లోని నివాసంలో శ్రీశైలంగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 17న శ్రీరామ నవమిని పురస్కరించుకుని కాలనీలో నిర్వహించ తలపెట్టిన సీతారాముల కల్యాణ మహోత్సవానికి రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు.

మహా మంత్రోచ్చరణ



రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ వెంకట్రామిరెడ్డినగర్‌లోని శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ఆలయ కమిటీ, హైదరాబాద్ ఒడిస్సా అసోసియేషన్ సంయుక్తంగా 12వ మహా మంత్రోచ్చరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ శ్రీకృష్ణ భగవానుడు కేవలం దేవుడు మాత్రమే కాదని, ఆయన జీవితం నేటి సమాజానికి గొప్ప సందేశాన్ని అందిస్తుందన్నారు. ఎటువంటి సమస్యనైనా ప్రేమ, ఓపికలతో జయించవచ్చని ప్రపంచానికి చాటిన మహానుభావుడన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానం అధ్యక్షులు కనకరాజు, సంక్షేమ సంఘం అధ్యక్షులు సతీష్ గట్టోజి, బీఆర్ఎస్ నాయకులు కార్తీక్ గౌడ్, రషీద్, రామకృష్ణ, తేజ, సంతోష్, రమ్మీగౌడ్, నిహార్, హైదరాబాద్ ఒడిస్సా అసోసియేషన్ సభ్యులు రమేష్, సత్య రంజన్, మున్నా, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణకు ప్రజల సహకారంతో పనిచేస్తాం

జీడిమెట్ల: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి.. సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత రెడ్డి అన్నారు. మంగళవారం సుభాష్‌నగర్ డివిజన్‌కు చెందిన మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తులసి, నాయకుడు నాగిరెడ్డిల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో పలువురు పార్టీలో చేరగా వారికి హన్మంతరెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఆరు గ్యారంటీలు విజయవంతంగా అమలవుతున్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ హరికిరణ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మధుసూదన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, నర్సింహారెడ్డి, రాజుచారి తదితరులు పాల్గొన్నారు.



గాజులరామారంలోని దర్గాలో ముస్లింలు నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీశైలం గౌడ్ – కుత్బుల్లాపూర్

ఉగాది.. సందడి





కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మంగళవారం ఉగాది వేడుకలు కనులపండువగా జరిగాయి. ప్రజలు కుటుంబ సమేతంగా ఇంట్లో పూజలు చేసి షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడి తాగారు. ఈ సందర్భంగా కుటుంబ సమేతంగా సంతోషంగా గడిపారు. సూరారంలోని ఉమామహేశ్వర ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. – సుభాష్‌నగర్



క్రోధి నామ సంవత్సర శుభాకాంక్షలు



ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును సత్కరించి ఉగాది శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

కుత్బుల్లాపూర్: క్రోధి నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయులు మంగళవారం ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వికానంద్‌లను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో పార్టీకి విజయాలు చేకూరుతాయని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు సోమేష్‌యాదవ్, బీఆర్ఎస్ డివిజన్ల అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, మిద్దెల బాల్‌రెడ్డి, వేణుయాదవ్, రవికాంత్ తదితరులు ఉన్నారు.

మైనంపల్లి హన్మంతరావుకు..



నిజాంపేట్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంతరావు ఆధ్వర్యంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే, మల్కాజ్‌గిరి జిల్లా ఇన్‌చార్జి మైనంపల్లి హన్మంతరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు క్రోధి నామ సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి శాలువతో సత్కరించారు. ఆయన వెంట కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, నిజాంపేట్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సొంటిరెడ్డి పున్నారెడ్డికి..



సుభాష్‌నగర్: క్రోధి నామ ఉగాది సంవత్సరాన్ని పురస్కరించుకుని మంగళవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. గాజులరామారం చిత్తారమ్మదేవి నగర్‌లోని ఆయన నివాసాని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో అందరికి శుభాలే జరగాలని సొంటిరెడ్డి అభిలాషించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో బుధవారం సరఫరాలో అంతరాయం కలుగనుందని బాచుపల్లి ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలియజేశారు. బాచుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అవాంతరాలు తలెత్తకుండా నూతనంగా ఏర్పాటు చేయనున్న 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పనుల నేపథ్యంలో ఉదయం 7గంటల నుంచి 9.30 గంటల వరకు 11వీకే ప్రణీత్, తరుణ్ భాస్వాని, వెంకట ప్రణీత్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అదే విధంగా 11కేవీ రాజీవ్‌గాంధీనగర్, సాయినగర్, జీపీఆర్ లేవుట్, ఎస్ఎల్‌జీ ఫీడర్ల పరిధిలో ఉదయం 7 గంటల నుంచి 7.30 గంటల వరకు కౌసల్యనగర్, సాయినగర్, రాజీవ్‌గాంధీనగర్, రాజీవ్‌గృహకల్ప ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

రంగనాథస్వామి ఉత్సవాలు ప్రారంభం



రాయదుర్గం: గోపన్‌పల్లి, పరిసర ప్రాంత ప్రజల ఆరాధ్య దైవం రంగనాథస్వామి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకం, అలంకారం తదితర పూజలను నిర్వహించారు. గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి కుటుంబసమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు.

నేటి పూజలు..

గోపన్‌పల్లి రంగనాథస్వామి ఆలయంలో రెండురోజుల ఉత్సవాలలో భాగంగా బుధవారం రెండో రోజు ఉదయం 6 గంటలకు ఆలయ సమీపంలోని సింగబావి వద్ద స్వామివారికి అవభృత స్నానం చేయిస్తారు. అనంతరం మేళతాళాలతో తిరిగి ఆలయానికి తీసుకొచ్చి పూజ చేస్తారు. భక్తుల దర్శనం అనంతరం ఉదయం 8.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో పంచాంగ పఠనం ఉంటుంది. అనంతరం ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.

చెరువులను పరిరక్షణకు పనిచేస్తాం

సుభాష్‌నగర్: ప్రజల నీటి అవసరాలను తీర్చుకోవడానికి.. భవిష్యత్ తరాలకు నీటి సమస్య లేకుండా ఉండాలంటే 'చెరువులను కాపాడుకోవడం.. పూడికతీత పనులను చెప్పట్టడం.. ఇంకుడు గుంతలను విధిగా ఏర్పాటు చేసుకోవడం..'ముఖ్యమని కుత్బుల్లాపూర్ మండల చెరువుల పరిరక్షణ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం షాపూర్‌నగర్‌లో జరిగిన సమావేశంలో కమిటీ సభ్యులు పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో కమిటీ ఆధ్వర్యంలో నీటి ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామన్నారు. చెరువులను పరిరక్షించేందుకు రాజకీయాలకు అతీతంగా ప్రజల సహకారంతో పనిచేస్తామని తెలిపారు.

కుత్బుల్లాపూర్‌లో ఖాళీ అవుతున్న కారు!

బీఆర్ఎస్‌కు ముఖ్య నాయకుల రాజీనామా



కుత్బుల్లాపూర్: నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అవుతోంది. ఇప్పటికే ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఒక్కొక్కరుగా పార్టీ మారుతుండగా తాజాగా గ్రేటర్ పరిధిలోని కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్లకు చెందిన నాయకులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కె.జయరామ్, టి.లక్ష్మారెడ్డి, కృష్ణాగౌడ్, సయ్యద్ రషీద్ బేగ్, ముప్వ రవికుమార్, మిర్జా రషీద్ బేగ్‌లు భగత్‌సింగ్‌నగర్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకొని మంగళవారం పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలోనే తమ నిర్ణయాన్ని వెల్లడిస్తామని ప్రకటించారు.

◆ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నిజాంపేట్ మేయర్ నీలారెడ్డితో పాటు పలువురు కార్పొరేటర్లు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరగా, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలకు సంబంధించిన కౌన్సిలర్లు త్వరలోనే చేరే ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీలో అంతర్భాగంగా ఉన్న రెండు సర్కిళ్ల నుంచి ముఖ్య నాయకులు పార్టీని వీడయడం జరుగుతూ వచ్చింది. సీనియర్ నాయకులుగా ఉంటూ వస్తున్న పైన పేర్కొన్న ఆరుగురు త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావులతో చర్చలు జరిపినట్లు తెలిసింది.